

ఎఆర్‌టి, సరోగసి ఆస్పత్రుల్లో తనిఖీ

ప్రజాశక్తి - కడప అర్బన్

వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.నాగరాజు పర్యవేక్షణలో ఎఆర్‌టి, సరోగసి యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకున్న కేంద్రాలను తనిఖీ చేశారు. నగరంలో లెవెల్ -2,3, లెవెల్ -1, 2 తనిఖీ చేశారు. జమ్మలమడుగు డివిజన్‌లోని లెవెల్-2, లెవెల్-1, ఎఆర్‌టి బ్యాంకు లను బృందం సభ్యులు తనిఖీ చేశారు. . అక్కడ పనిచేసే సిబ్బంది రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. వారికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఎటువంటి అక్రమాలకు పాల్పడినా చట్ట ప్రకారం శిక్షార్హులని డిఎంహెచ్ఓ హెచ్చరించారు. కడప జిల్లాలోని స్త్రీ వ్యాధి నిపుణులు ఉన్న ఆస్పత్రులన్నీ ఎఆర్‌టిలో రిజిస్టర్ చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ వి.డి.గీత, డాక్టర్ రేఖా రావు, డాక్టర్ భవ్య, రమణమ్మ కుమారి, పాలేశ్వరరావు పాల్గొన్నారు.

'స్థానిక' వేడి షురూ!



జడ్‌పిటిసి అభ్యర్థుల ఎంపికలో నాయకులు బిజీ

జడ్‌పి చైర్మన్‌తో రాజంపేట ఎమ్మెల్యే మంతనాలు

అధికార టిడిపిలో అయోమయం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి రాజుకుంది. జిల్లాలోని ఒంటిమిట్ట, పులివెందుల జడ్‌పిటిసి అభ్యర్థుల ఎంపికపై అధికార టిడిపి, వైసిపి తమదైన కసరత్తు చేస్తున్నాయి. వైసిపి ఒంటిమిట్ట జడ్‌పిటిసి అభ్యర్థి ఎంపిక విషయంలో మంగళవారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి, ఇతరులను కలిసి సంప్రదింపులు చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో రాజంపేట అసెంబ్లీ ప్రత్యేకతను కలిగి ఉంది. రాజంపేట పార్లమెంట్ పరిధిలో ఎమ్మెల్యే, లోక్‌సభ సభ్యులు, రాజ్యసభ సభ్యులను కలిగి ఉంది. రాజంపేట ఎంపీ పి.వి. మిథున్‌రెడ్డి లిక్కర్ స్కామ్‌లో నిందితుడిగా రాజమండ్రి జైలులో ఉండడాన్ని మినహాయిస్తే మిగిలిన రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి క్రియాశీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటిమిట్ట జడ్‌పిటిసి అభ్యర్థిగా గెలిచిన ఆకేపాటి అమరనాథరెడ్డి జడ్‌పి చైర్మన్‌గా నియమితులైన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో చైర్మన్ పదవికి రాజీనామా చేసి రాజంపేట బరిలో దిగి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బ్రహ్మంగారిమఠం జడ్‌పిటిసి ముత్యాల రామ గోవిందరెడ్డి చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆగస్టు ఒకటిన జడ్‌పిటిసి స్థానాలకు నామినేషన్ దాఖలు చేయాల్సిన నేపథ్యంలో ఒంటిమిట్ట ఎన్నికల బరిలో అభ్యర్థిగా ఎవరిని నిలపాలనే అంశంపై సంప్రదింపులు చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో జడ్‌పిటిసిగా ఎన్నికైన ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, లేక మరెవరినైనా నిలుపుతారా అనే అంశంపై అందరి దృష్టి నిలిచింది. వీరిలో ఎవరు ఎన్నికల బరిలో నిలవడానికి సమర్థులు, ఎవరు ముందుకు వస్తారనే అంశం అందరిని ఆకర్షిస్తోంది. రాష్ట్రంలో టిడిపి అధికారంలో ఉన్న పరిస్థితుల్లో ప్రత్యర్థి వైసిపి తరుపున బరిలో నిలిచి గెలవడం అంత సులభం కాని పరిస్థితులు నెలకొన్నాయి. పులివెందుల జడ్‌పిటిసి అభ్యర్థి ఎంపిక విషయంలో కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి కీలకపాత్ర పోషించే అవకాశం ఉంది. పార్లమెంట్ సమావేశాల్లో బిజీగా ఉన్న నేపథ్యంలో ఎవరిని ఎంపిక చేస్తారో అనే ఆసక్తి వైసిపి కేడర్‌లో నెలకొని ఉంది. అధికార టిడిపిలో అయోమయం నెలకొంది. రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంశంలో స్పష్టత కొరవడింది. ప్రస్తుత రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు అభ్యర్థి ఎంపికలో క్రియాశీలకంగా వ్యవహరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒంటిమిట్ట జడ్‌పిటిసి అభ్యర్థిగా తప్పెటవారిపల్లికి చెందిన గజ్జెల నరసింహారెడ్డిని నియమిస్తారా, లేక ఇతరులెవరిని నియమిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.టెక్ రవి జడ్‌పిటిసి అభ్యర్థి నియామకంలో కీలకంగా వ్యవహరించే అవకాశం కనిపిస్తోంది. ఏదేమైనా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికార వైసిపి, టిడిపి నాయకుల్లో ఉత్కంఠ నెలకొన్నట్లు కనిపిస్తోంది.

నేటి నుంచి జడ్‌పిటిసి ఎన్నికకు నామినేషన్లు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల జడ్‌పిటిసి స్థానానికి బుధవారం నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. జడ్‌పిటిసి మహేశ్వర్‌రెడ్డి మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. మొత్తం ఓటర్లు 10,601 మంది ఉండగా వాటిలో స్త్రీలు 5464 మంది, పురుషులు 5137 మంది ఉన్నారు. ఈనెల 30 నుంచి ఆగస్టు 1 సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 2న పరి శీలన, 3న తిరస్కరణ, 5న మధ్యాహ్నం 3 గంటల లోపల ఉపసంహరణ, ఆగస్టు 12న ఎన్నికలు నిర్వహించనున్నారు. 14న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు.

పోటీనా.. ఏకగ్రీవమా అనేదానిపై ఉత్కంఠ

ఆర్.తుమ్మలపల్లె గంగమ్మ జాతరలో ప్రమాదవశాత్తూ జడ్‌పిటిసి మహేశ్వర్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ స్థానానికి ఉప ఎన్నికలు రావడంతో పోటీ జరుగుతుందా లేక ఏకగ్రీవం అవుతుందా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. మహేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యుల్లో ఒకరిని వైసిపి అభ్యర్థిగా నిలిపితే ఏకగ్రీవం అవుతుందని చర్చ జరుగుతోంది. అలాకాకుండా ఇతరులను ఎవరిని అభ్యర్థులుగా నిలిపిన టిడిపి తమ అభ్యర్థులను నిలుపుతుంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఎన్నికలు జరిగితే ఉత్కంఠగా మారే అవకాశం ఉంది. ఏది ఏమైనప్పటికీ ఉప ఎన్నికలు రాజకీయ పార్టీలకు, అధికారులకు సవాలుగా మారనుంది.

ప్రధానోపాధ్యాయుడు సస్పెన్షన్

ప్రజాశక్తి - కడప అర్బన్ : కమలాపురం మండలం పెద్దచెప్పలి హైస్కూల్ హెచ్ఎంను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశాలు జారీ చేశారు. వివరాలు.. కమలాపురం మండలం పెద్ద చెప్పలి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఓబుల్ రెడ్డి మద్యం తాగి పాఠశాలకు వెళ్లిన నేపథ్యంలో సహచర ఉద్యోగులు ఆయన్ను బయటకు పంపించారు. ఈ విషయం మీడియాలో ప్రచారం కావడంతో కలెక్టర్ ప్రధానోపాధ్యాయుడుని సస్పెండ్ చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేసేందుకు డిఇఒను విచారణ అధికారిగా నియమించారు. కార్పొరేషన్ కమిషనర్ గెస్ట్ హౌస్‌లో పేకాట ఆడుతున్న సిబ్బందిని ఇటీవల కలెక్టర్ సస్పెండ్ చేసిన విషయం మరవకముందే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాగి పాఠశాలకు వెళ్లడంతో ఆయన్నూ సస్పెండ్ చేశారు.

ఏదైనా సాధించాలంటే సంకల్ప బలం ఉండాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జీవితంలో తాను ఎంచుకున్న గమ్యాన్ని చేరుకోవాలంటే దీక్ష, కృషి, పట్టుదల, క్రమశిక్షణతో పాటు సంకల్ప బలం ఉండాలని ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. మంగళవారం కడప ఎస్‌కెఆర్అండ్ ఎస్‌కెఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వీధి బడి చదువు నుంచి విశ్వవిద్యాలయ ఆచార్యుల వరకు ఎదిగి వైనాన్ని తెలిపారు. జీవితంలో విజయాన్ని సాధించాలని తపన ఉన్నవారికి తగిన విధంగానే మార్గాలు దొరుకుతాయని చెప్పారు. మన లక్ష్యాన్ని చేరుకునే మార్గంలో అనేక అవరోధాలు, ఆటంకాలు ఎదురవుతాయని, వాటిని అధిగమించి నిలకడగా, క్రమం తప్పకుండా కృషి చేస్తే ఫలితం సాధిస్తారని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన ముఖాముఖిలో విద్యార్థినులు అడిగిన ప్రశ్నలకు మల్లికార్జున రెడ్డి సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ వి.సలీం బాషా, ఆంగ్ల శాఖ విభాగాధిపతి పి. సుజాత, కె.నమ్రత, బి.కేశవరెడ్డి, జిపి ఆశాలత, జి. అజంతుల్లా, తెలుగు శాఖ అధ్యాపకులు నాగసుధారాణి, రిటైర్డ్ అధ్యాపకులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, విద్యార్థినులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ డైరెక్టర్ భానుజ

నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - కడప అర్బన్

బాలల అక్రమ రవాణా తీవ్రమైన నేరంగా భావిస్తూ, ఈ నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం గుర్తించాలని రూరల్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ భానుజ పిలుపునిచ్చారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15 నుంచి 29 వరకు బాలల అక్రమ రవాణాపై రైల్వే శాఖతోపాటు ఇతర శాఖలను సమన్వయం చేసుకుని ప్రజలను చైతన్యవంతులను చేసే కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం కడప రైల్వే స్టేషన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల అక్రమ రవాణా ప్రస్తుతం రూపం మారిందన్నారు. మన దేశంతోపాటు ఇతర దేశాలకు బాలలను తరలించి విక్రయించే చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఈ క్రమంలో పిల్లలను ఆకర్షించడం, భయపెట్టడం, కొనడం, అమ్మడం, దోపిడీ చేయడం కోసం వేరే ప్రదేశానికి తీసుకెళ్లడాన్ని తీవ్ర నేరంగా పరిగణించాలన్నారు. అనుమానాస్పద పరిస్థితుల్లో పిల్లలను ప్రయాణిస్తున్నట్లు చూసినట్లయితే 1098, 1800 1027 222, 8333836639 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం తమ సంస్థ కడప, అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి జిల్లాలో పనిచేస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయడంతోపాటు రెస్క్యూ ఆపరేషన్, అవగాహన సదస్సులు, ప్రచారోద్యమం కొనసాగిస్తోందని తెలిపారు. అందరి సహకారాలతో పిల్లలు, మహిళల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా చర్యలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో రూరల్అండ్ ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులు, పాల్గొన్నారు.



ఏర్పాట్లపై చర్చిస్తున్న అధికారులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి

సిఎం పర్యటన ఏర్పాట్లు ముమ్మరం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ఆగస్టు 1న జమ్మలమడుగు వస్తున్న నేపథ్యంలో అధి కారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జమ్మలమడుగు మండల పరిధిలోని అంబవరం పంచాయతీలోని పాలిటెక్నికల్ కళాశాలకు పక్కన ఉన్న ప్రయివేట్ ప్రదేశంలో హెలిప్యాడ్ కోసం స్థలాన్ని మొత్తం చదును చేశారు. నీటి ట్యాంకర్ల ద్వారా ఆ ప్రదేశం మొత్తాన్ని తడిపి రోలర్‌తో చదును చేయించారు. గండికోటలో కూడా మరో హెలిపాడ్‌ను తయారు చేస్తు న్నట్లు సమాచారం. పాలిటెక్నికల్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో ముఖ్యమంత్రి దిగి అక్కడి నుంచి రోడ్డు మార్గాన గూడెం చెరువు పంచాయతీలోని రాజీవ్ నగర్ కాలనీలో చేనేతల కుటుంబాలకు చేరుకొని పింఛన్ పంపిణీ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. అనంతరం పి4 బహిరంగ సభ వేదిక కోసం టిడ్కో హౌస్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని చదును చేస్తున్నారు. బారి కేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. అక్కడి నుంచి గండకోటకు చేరుకొని పర్యాటక స్థితిగతులపై సమీక్షించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. హెలికాప్టర్ ద్వారా గండికోట జలాశయం, సున్నపురాళ్లపల్లె వద్దనున్న జెఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోయే ఉక్కు పరిశ్రమ కోసం ఏరియల్ సర్వే చేస్తున్నట్లు సమా చారం. అందుకోసం మంగళవారం జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డితో పాటు జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ, కో- ఆర్డినేటర్ సభ వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలించారు.

విద్యార్థులను దృఢంగా తయారు చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - కడప అర్బన్ : విద్యార్థులను మానసికంగా దృఢంగా తయారు చేయడమే లక్ష్యమని జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారి ఆరోగ్య మేరీ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని నాగరాజు పేటలో ఉన్న మున్సిపల్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులను మానసికంగా దృఢంగా, ఒక నిర్దేశిత ఉన్నత లక్ష్యం వైపు నడిపించడానికి సమగ్ర శిక్ష ప్రాజెక్టు ద్వారా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పదిమంది జిల్లా కౌన్సిలర్స్ ద్వారా విద్యార్థులకు ప్రత్యేకంగా మానసిక దృఢత్వాన్ని పెంపొందించుటకు, కెరీర్ గైడెన్స్, భవిష్యత్తులో వారు ఉన్నత స్థానం చేరుకోవడానికి కావలసిన సమాచారాన్ని పొందడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆశ్రీఫన్, టీచర్ నాగరత్నమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పవిత్ర పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

ప్రజాశక్తి-కాశినాయన

గ్రామాలలో వ్యవసాయ అధికారుల సూచనలను రైతులు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వ్యవసాయ అధికారి బి. చంద్రమోహన్ తెలిపారు మంగళవారం మండల పరిధిలోని రంపాడు, ఉప్పలూరు. గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ విస్తరణ అధికారి రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి వ్యవసాయాధికారి హాజరై మాట్లాడారు. కంది, జొన్న, పెసర, మినుము పంటలకు క్రాప్ ఇన్సురెన్స్‌కు ఈనెల 31 చివరి రోజు అన్నారు. ప్రతి రైతూ పంపారు వివిఎ నాగరత్నం వద్ద పంట నమోదు చేయించుకుని పత్రాన్ని మీ సేవలో ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎఎ నాగరత్నం, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు, సలహాలిస్తున్న వ్యవసాయాధికారులు

బలవంతపు భూసేకరణ ఆపాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

సోలార్ ప్లాంట్ పేరుతో రైతుల నుంచి బలవంతపు భూసేకరణ ఆపాలని, 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సోలార్ బాధిత గ్రామాల్లో కల్వటాల, గోవింద పల్లె, పాపాయపల్లె గ్రామాల్లో రైతు సంఘం రాష్ట్ర నాయకులు సోలార్‌లో భూములు కోల్పోతున్న రైతులతో ఆయన మాట్లాడారు. సోలార్ ప్లాంట్ యాజమాన్యం రైతుల దగ్గర బలవంతపు సేకరణ చేయడం, భూములు ఇవ్వకపోతే అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపడం చాలా దుర్మార్గకరమైన చర్య అన్నారు. లీజు పేరుతో రైతుల దగ్గర తీసుకున్న భూములు తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోలార్ ప్లాంట్‌లో భూములు కోల్పోతున్న గ్రామాలలో రస్తాలు కూడా ఆక్రమించుకోవడం చాలా అన్యాయమని వాపోయారు. గ్రామాలకు పోయే రహదారులను యథావిధిగా కొనసాగించాలన్నారు. రైతుల అనుమతి లేకుండా రాత్రి సమయాలలో బలవంతంగా గుంతలు తీసి స్తంభాలు ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. సోలార్‌లో నష్టపోయిన బాధిత రైతులందరికీ న్యాయమైన నష్టపరిహారం కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో దశల వారి ఆందోళన పోరాటాలకు శ్రీకారం చుడుతున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి మనోహర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి.శివకుమార్, సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి గోపాలదాసు ఏసుదాసు, జమ్మలమడుగు సిఐటియు నాయకులు విజయ్, వినయ్, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి శివన్నారాయణ, సిఐటియు నాయకులు శేఖర్ తో పాటు బాధిత రైతులు మహేంద్ర, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూ బాధితులతో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సోలార్ లీజును విధానం రద్దు చేయాలి

సోలార్ లీజును ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అనుమతి తీసుకోకుండా గుంతలు తీసి దిమ్మెలు ఎలా కడతారని ప్రశ్నించారు.? ఒక్కో రైతు నుంచి దాదాపు 29 సంవత్సరాలు పాటు భూమిని లీజుకు తీసుకుంటే ఆ రైతు కుటుంబం తీవ్రంగా నష్టపోతుందన్నారు. కనీసం 10 సంవత్సరాలు అయినా లీజు సమయాన్ని కేటాయించాలని పేర్కొన్నారు. సోలార్ ఆదాయంలో 20 శాతం బాధిత కుటుంబాలకు ఇవ్వాలన్నారు. ప్రాజెక్టు కిందికి భూములు కోల్పోయిన బాధితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి రాజకీయ ఒత్తిడి లేకుండా స్థానికులకు న్యాయం చేయాలన్నారు. సోలార్ ప్రాజెక్టు కోసం ఎన్నో ఏళ్ల నుండి వస్తున్న రస్తాలను మూసివేయడం తగదని, వెంటనే వాటిని తిరిగి పునఃప్రారంభించాలని తెలిపారు.

అక్రమ కార్యకలాపాలకు తావివ్వం

- జైళ్ల శాఖ డిజి అంజనీ కుమార్

ప్రజాశక్తి - కడప

భవిష్యత్తులో జైలులో ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు తావు ఇవ్వకుండా చూస్తామని జైళ్ల శాఖ డిజి అంజనీకుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కడప సెంట్రల్ జైలును సందర్శించారు. అధికారులతో మాట్లాడి అక్కడ విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎలాంటి అక్రమ కార్యకలాపాలు జరక్కుండా చూస్తామని, అందుకు అధికారులు కూడా హామీ ఇచ్చారని చెప్పారు. కడప సెంట్రల్ జైలు అధికారులు ఇచ్చిన హామీని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు. మహిళా ఖైదీలకు సంబంధించి స్కిల్ డెవలప్మెంట్, స్కిల్ ఇంప్రూవ్‌మెంట్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నెలరోజుల్లో స్కిల్ డెలప్‌మెంట్‌ను ప్రారంభిస్తాం అని చెప్పారు. స్పోర్ట్స్ విభాగంలోనూ ఖైదీలకు అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు. అందుకు తగిన చర్యలు ఇప్పటికే చర్యలు మొదలయ్యాయని తెలిపారు. మదనపల్లి సక్సస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టిఒటి కోర్సును తీసుకు వస్తున్నామని చెప్పారు. శిక్ష అనుభవించిన ఖైదీలు విడుదల అయ్యాక సమాజంలో గౌరవం, ఉపాధి పొందేలా ఈ ట్రైనింగ్ ఇస్తారని చెప్పారు. ఇది త్వరలో అన్ని జిల్లా కేంద్ర కారాగాల్లో మొదలవుతుంది అన్నారు. యోగా సర్టిఫికెట్ దేశ వ్యాప్తంగా గుర్తింపు ఉంటుంది అని, ప్రతి జిల్లా కేంద్రంలో నుంచి పది నుంచి 15 మంది యోగా ట్రైనర్లను ఆరునెలల్లో తయారు చేసే లక్ష్యం పెట్టుకున్నాం అని తెలిపారు .జైలు నుంచి ఖైదీల ను విచారణకు ఇ-ములాకత్ ద్వారా మెజిస్ట్రేట్‌ల ముందు ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. .ఇప్పటికే 90 శాతం ఖైదీలను ఇ -ములాకత్ ద్వారా మెజిస్ట్రేట్ ముందు హాజరపరుస్తున్నాం అని తెలిపారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న డిజి



కార్పొరేషన్ ఎదుట నిరసన తెలియజేస్తున్నకార్మికులు

కార్పొరేషన్ ఎదుట కార్మికుల నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోగల 9వ వార్డును వర్క్ అవుట్ సోర్సింగ్ పేరిట ప్రయివేట్ కాంట్రాక్టర్లకు అప్పగించే చర్యలను విడనాడాలని మున్సిపల్ కార్మికులు వేదాయపాలెం వద్ద శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తుంటే పోలీసులు వారిని అరెస్టు చేసి, లాఠీఛార్జ్ చేయడం అన్యాయమని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) యూనియన్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో 27 రోజులగా సమ్మె చేస్తూ ఉంటే అక్కడున్న ప్రభుత్వ అధికారులు, పాలకవర్గం, సమ్మె చేస్తూ ఉంటే సమస్యలు పరిష్కారం చర్చలు జరపకుండా కార్మిక నాయకుల్ని, కార్మికుల్ని 50 మంది పైగా అరెస్టు చేశారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ మంత్రి సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో నెల్లూరు నగరంలో మొదలైన సమ్మె మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం కడప జిల్లా ఉపాధ్యక్షులు తిరుమలేష్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ కంచుపాటి శ్రీరామ్, నగర ఉపాధ్యక్షులు ఇత్తడి ప్రకాష్, డ్రైవర్ల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సుంకరి కిరణ్, వడ్లపల్లి శ్రీధర్ బాబు, కార్మికులు పాల్గొన్నారు. **బద్వేలు :** అక్రమ అరెస్టులు నిరసిస్తూ మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయం మాస్టర్ పాయింట్ వద్ద యూనియన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి కాలువ శివకుమార్, యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు దియ్యాల హరి, ఉపాధ్యక్షులు, గంటా శ్రీనివాసులు, దియ్యాల దేవమ్మ,కార్యదర్శి నాగరపు సత్యరాజు,కమిటీ సభ్యులు తేళ్ల కిరణ్, ఇండ్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సిఎం హామీని నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప హజ్ హౌస్‌ను 2026 హజ్ యాత్ర ప్రారంభ బిందువుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించాలని ముస్లిం సమైక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ కోరారు. మంగళవారం వైవి స్ట్రీట్‌లోని వేదిక కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, పాదయాత్రలో లోకేష్ మళ్లీ ఆ హామీని పునరుద్ఘాటించారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో నిర్మితమై గత వైసిపి ప్రభుత్వంలో కడప హజ్ హౌస్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రారంభించాలని పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న హజ్ యాత్రికులు విజయవాడకు ప్రయాణించడం చాలా కష్టమైన విషయమన్నారు. ఈ నేపథ్యంలో, కడప హజ్ హౌస్‌ను పూర్తిగా ఉపయోగించడానికి చర్యలు తీసు కుంటామని నారా చంద్రబాబు , నారా లోకేష్ హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఎపిరాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హసన్, యాత్రికులపై మౌనంగా ఒత్తిడి తీసుకువచ్చి విజయవాడనే ఏకైక ఎంబార్కేషన్ పాయి ంట్‌గా తీసుకోవాలని ప్రోత్సహిస్తుండడం చాలా బాధాకరం, దురదృష్టకరమన్నారు. ప్రస్తుతం కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా మన తెలుగు రాష్ట్రానికి చెందిన వ్యక్తి ఉన్నారని, కేంద్ర ప్రభుత్వం కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో హజ్ యాత్ర కడప హజ్ హౌస్ నుండే ప్రారంభించడం సాధ్యమైన విషయమే అన్నారు. ఇది రాష్ట్ర ప్రభు త్వం తన హామీని నిలబెట్టుకునే సరైన సమయమన్నారు. సమావేశంలో రాయలసీమ ఇన్‌ఛార్జి అలీషేర్, ప్రధాన కార్యదర్శి రియాజ్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

మానవతను చాటుకునే వారికి గొప్ప అవకాశం

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పి4 ఫౌండేషన్ కార్యక్రమం విధానం మానవతను చాటుకునే మార్గదర్శులకు గొప్ప అవకాశం అని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులోపి-4 కార్యక్రమానికి సంబంధించి జిల్లాలోని మార్గదర్శకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభు త్వం చేపట్టే పి4 ఫౌండేషన్ ద్వారా ప్రతి బంగారు కుటుంబం కూడా భవిష్యత్ మార్గ దర్శిగా ఎదగగలదని ఆకాంక్షించారు. మన ఉన్నతికి ప్రతిస్థాయిలో నిస్వార్థంగా సాయం చేసిన వారు ఎంతో మంది ఉంటారన్నారు. వారందరినీ స్ఫూర్తిగా తీసుకొని స్వచ్ఛందంగా మనకు చేతనైన సాయాన్ని అవసరమైన కుటుంబాలకు అందిద్దామని పిలుపునిచ్చారు. పి4 ఫౌండేషన్ ద్వారా మరో పది మందికి సాయం చేసే అవకాశం మనకు కలుగుతుందన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పి -4 కార్యక్రమం అమలు తీరును వివరిస్తూ తద్వారా బంగారు కుటు ంబాలు సాకారం ఎలా సాధ్యమవుతుంది అనే విషయాన్ని క్షుణ్ణంగా వివరించారు. అర్హులైన పేద కుటుంబాలను గుర్తించడంతో పాటు వారిని దత్తత తీసుకునేందుకు మార్గదర్శులు సహృద్భవంతో ముందుకు సాగాలన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రవాసాంధ్రులను కూడా భాగస్వామం చేసుకొని బంగారు కుటుంబాల దత్తత ఎంపిక నమోదు క్షేత్ర స్థాయిలో వేగవంతంగా పూర్తి చేసి తప్పక ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం అందించిన మార్గదర్శకాలు మేరకు దత్తత తీసుకోవాలన్నారు. సమావేశంలో జెసి అదితి సింగ్, డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, కడప, బద్వేలు ఆర్‌డిఒలు జాన్ ఇర్విన్, చంద్ర మోహన్, సిపిఒ హజరతయ్య, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, డ్వామా పీడి అదిశేషారెడ్డి, ఇండస్ట్రీస్ జీఎం చాంద్ బాషా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భూములు కట్టబెట్టే జిఒ137ను రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో 13.83 ఎకరాలు ప్రభుత్వ భూములను, విజయవాడలో 4.15 ఎకరాల ఆర్‌టిసి భూములను బహుళజాతి సంస్థ లులు కు కట్టబెడుతూ విడుదల చేసిన 137 జిఒను తక్షణమే రద్దు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లులును ప్రోత్సహించడమంటే వేలాది మంది చిన్న వ్యాపారులను, లక్షలాది మంది ఉపాధిని దెబ్బకొట్టడమేనని పేర్కొన్నారు. ఆర్‌టిసి, ప్రభుత్వ రంగా ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వమే, వాటిని ఇతరులకు కట్టెబెట్టేందుకు సిద్ధమవడం దారుణమన్నారు. ఆర్‌టిసికి చెందిన విలువైన భూములను విజయవాడలోనూ, విశాఖలోని ప్రభుత్వ భూములను లులు మాల్ కోసం కేటాయించడం సరికాదన్నారు. రిటైల్ వరక్తక రంగంలోకి బడా కంపెనీల ప్రవేశంతో చిన్న, మధ్యతరగతి వ్యాపార రంగం ఇప్పటికే దెబ్బతిందన్నారు. లులు వంటి అంతర్జాతీయ కంపెనీలతో పూర్తిగా నాశనమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి, జీవోని రద్దు చేసి ప్రభుత్వ, ఆర్‌టిసి స్థలాలను కాపాడాలని, చిన్న, మధ్య తరగతి వ్యాపారులను రక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

అడిషనల్ పారిశుధ్య కార్మికుల కన్వీనింగ్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరపాలక సంస్థలో పని చేస్తున్న అడిషనల్ పారిశుధ్య కార్మికుల కన్వీనింగ్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. పాత మున్సిపల్ కార్యాలయంలో నూతన కమిటీని ప్రకటించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్, నగర సహాయ కార్యదర్శి ప్రకాష్ మాట్లాడుతూ కడప నగరపాలక సంస్థ రోజు రోజుకూ దినదినాభివృద్ధి చెందుతూ నగర వైశాల్యం, జనాభా గణనీయంగా పెరుగుతుందని చెప్పారు. నగర సుందరీకరణకు అహర్నిశలు శ్రమిస్తున్న వారికి రోజువారి వేతనం కేవలం రూ.400 మాత్రమే చెల్లించడం సరికాదని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కలెక్టర్ ఉత్తర్వులకనుగుణంగా రోజువారి దినసరి వేతనం కార్పొరేషన్ పరిధిలో నైపుణ్యంలేని పనికి రూ.596 చెల్లించాలని, ఆదేశాలున్నప్పటికీ ఆ వేతనం ఇవ్వకపోవడం బాధాకరమని చెప్పారు. వారందరికీ ప్రభుత్వ స్కీములైన ఇపిఎఫ్, ఇఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల నిర్వహించిన అడిషనల్ పారిశుధ్య కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో 25 మంది సభ్యులతో యూనియన్ కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. కన్వీనర్‌గా హరికృష్ణను కార్మికులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. సభ్యులుగా యం.రాజు, పెంచలయ్య, శివానాయక్, మణికంఠ, అమరావతి, బేబీ, రాము, కోండయ్య, శివా, చిరంజీవి, మహష్, నిత్య, ఆనందరావు, జయన్న, విజయ్ ప్రతాప్, మహష్, తిరుపతమ్మ, ఏసు, గురు, చిన్న గంగయ్య, గంగయ్య, మహేష్, పోలయ్య ఎన్నికయ్యారు.



డిఇకి వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు, విద్యుత్ కార్మికులు

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాష్ట్రంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సభ్యులు డిమాండ్ చేశారు. ఆ మేరకు వారు మంగళవారం గోడ పత్రాలను విడుదల చేశారు. పట్టణంలోని విద్యుత్ కార్యాలయ ఆవరణలో ఆగస్టు 7న నిర్వహించే చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు, సిఐటియు జిల్లా నాయకులు గఫూర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కార్మికులకు రూ.కోటి ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. 20ఏళ్లుగా పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందర్నీ రెగ్యులర్ చేయాలన్నారు. 2022 పిఆర్‌సి రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చిన విధంగా కాంట్రాక్టు కార్మికులకు కూడా ఇవ్వాలన్నారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ నాయకులు డిఇ గురుమోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

వేంపల్లె సబ్ డివిజన్ నూతన కమిటీ ఎన్నిక..

ఈ సందర్భంగా వేంపల్లి సబ్ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సబ్ డివిజన్ కమిటీ అధ్యక్షులుగా సి.సిద్ధారెడ్డి, కార్యదర్శిగా చంద్రారెడ్డి, ఉపాధ్యక్షులుగా నాగభూషణంరెడ్డి, ఇసి గంగిరెడ్డి, కె.రవికుమార్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ పులివెందుల డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమౌళి, వేంపల్లి సబ్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధారెడ్డి, చంద్రారెడ్డి, విద్యుత్ కార్మికులు మధుసూదన్, శేఖర్, మస్తాన్‌వలి, గణేష్, అమర్నాథ్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, బాలు, మహేశ్వర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రవీంద్ర, అరుణ్‌కుమార్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మహీర్ పాల్గొన్నారు.

వేంపల్లె : విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఆగస్టు 7న తల పెట్టిన చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా అధ్యక్షుడు శ్రీనువాసులు కోరారు. శ్రీనువాసులు ఆధ్వర్యంలో విద్యుత్ ఎఇ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక 132 కెవి సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలనే గోడపత్రాలు విడుదల చేశారు.

ప్రజా కౌన్సిల్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రజా కౌన్సిల్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్ బాషా తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత కౌన్సిల్ మాయా బజార్‌ను తలపిస్తోందన్నారు. కౌన్సిల్ సమావేశాల్లో కౌన్సిలర్లు లేవనెత్తుతున్న ప్రజా సమస్యలు అధికారులు పరిష్కరించడం లేదన్నారు. కేవలం టైంపాస్ కోసం సమా వేశాలు నిర్వహిస్తున్నట్లు ఉందని పేర్కొన్నారు. టైంపాస్ కోసం సమావేశాలు నిర్వహించడం ఎందుకు, ప్రజాధనం వృథా చేయడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. మంచినీటి పైప్‌లైన్ మార్చుమని కొన్నాళ్లుగా చెబుతున్నా కమిషనర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. పారిశుధ్యం మెరుగుపరచడానికి కమిషనర్ తీసుకున్న చర్యలు ఏంటని ప్రశ్నించారు. ఆగిపోయిన కూరగాయల మార్కెటును ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అధికారమిస్తే వేలాది ప్రజల సమక్షంలోనే కౌన్సిల్ సమావేశాలు నిర్వహి స్తామన్నారు. మున్సిపల్ అధి కారులు లంచాలకు అలవాటు పడి ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని అన్నారు. స్థానిక కౌన్సిలర్ లేకుండా కమిషనర్ వార్డులలో పర్యటించడం ఏమిటని పేర్కొన్నారు. అభివృద్ధిని కోరుకునే పార్టీకి ప్రజలు అవకాశం ఇవ్వాలన్నారు. ప్రొద్దుటూరు భవిష్యత్తుపై విజన్ ఉన్న నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి పౌరుడ్ని నాయకునిగా తయారు చేస్తామని ఇర్ఫాన్‌బాషా తెలిపారు.



మాట్లాడుతున్న ఇర్ఫాన్‌బాషా

'గండి' ఉత్సవాలకు రావాలని జగన్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - చక్రాయపేట

గండిక్షేత్రంలో జరుగుతున్న శ్రావణ మాసోత్సవాలకు రావాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆలయ పాలక మండలి సభ్యులు కోరారు. ఆ మేరకు వారు మంగళవారం తాడేపల్లిలోని ఆయన క్యాంప్ ఆఫీస్‌లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో గండి ఆలయ పాలకమండలి చైర్మన్ కావలి కృష్ణతేజ, ఆలయ ఉప ప్రధాన అర్చకులు రాజాస్వామి, సభ్యులు బిందుసాగర్, మధు, బ్రహ్మానందరెడ్డి, కొండారెడ్డి, శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.



జగన్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ పాలక మండలి సభ్యులు

క్రైం కార్నర్

ట్రాక్టర్ బోల్తా : వ్యక్తి మృతి

ప్రజాశక్తి - లింగాల

ఇంటి వద్ద మట్టి అవసరం ఉండడంతో ట్రాక్టర్‌తో మట్టిని సేకరించేందుకు వెళ్లిన వ్యక్తి దారి మార్గంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం రామన్నూతలపల్లెలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. బసినేని చిన్నరాముడు(66) ఇంటి సమీపంలో మట్టి అవసరం ఉండడంతో గ్రామానికి చెందిన పోచంరెడ్డి వీరాంజనేయుల రెడ్డి ట్రాక్టర్ తీసుకుని మట్టి సేకరించేందుకు వెళ్లాడు. గ్రామానికి చెందిన పాత మైన్స్ వద్ద మట్టిని సేకరించి వస్తుండగా దారి మార్గంలో ట్రాక్టర్ అదుపు తప్పడంతో కిందకి దూకాడు. ట్రాక్టర్ ట్రాలీ అతని మీద ఎక్కడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో అతని తల ఛిద్రమైంది.

రోడ్డు ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలోని యామవరం గ్రామ సమీపంలో యామవరం ఫీల్డ్ అసిస్టెంట్ మద్దూరి శివప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యామవరం గ్రామానికి చెందిన శివప్ర సాద్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం తన పొలం వద్దకు వెళ్లి తిరిగి గ్రామానికి నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ప్రమాదంలో శివప్రసాద్ రెండు కాళ్లు విరిగాయి. అతన్ని 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



తీవ్రంగా గాయపడిన శివప్రసాద్

ముమ్మరంగా వ్యవసాయ పనులు



నారుమడికి పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - చాపాడు

కెసి కాలువకు నీరు విడుదల కావడంతో రైతులు పూర్తిగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కులు, వరి నారు సాగుకు ఏర్పాట్లు, కాలువలలో పూడికతీత, నారుమడి కయ్యల తయారీ వంటి పనుల్లో లీనమయ్యారు. పంట పొలాల్లో ఎక్కడ చూసినా రైతులు పనులు చేస్తూ కనిపిస్తున్నారు. జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదు అయినప్పటికీ కర్ణాటక, మహారాష్ట్రలో అత్యధిక వర్షం వల్ల శ్రీశైలానికి సకాలంలో నీరు రావ డంతో కెసి కాలువకు అధికారులు ఈ నెల రెండవ వారంలో నీటిని విడుదల చేశారు. రైతులు ఊహించని విధంగా ముందస్తుగా కెసి కాలువకు నీరు విడుదలైంది. 20 రోజుల్లో ముందస్తుగా వరి పంటను సాగు చేస్తే నవంబర్ చివరి వారానికి నూర్పిడికి వస్తుందని, ఆ సమయంలో తుఫాన్లు ఉంటాయని వరి నారులు సాగు చేపట్టలేదు. ప్రస్తుతం పంటల సాగు చేసేందుకు రైతులు నిమగ్నమయ్యారు. విత్తనపు వడ్లను అధికంగా సేకరిస్తున్నారు. 30 కిలోల విత్తనాల వడ్లు రూ.1,250 నుంచి రూ.1,500 వరకు అమ్మకాలు చేస్తున్నారు. మైదుకూరు, ఖాజీపేట, ప్రొద్దుటూరు, నంద్యాల నుంచి విత్తన వడ్లను రైతులు సేకరిస్తున్నారు. రెండు రోజులుగా ఎక్కడ చూసినా వరి నార్ల సాగు చేపడుతూ రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. రాజువారిపేట అయ్యవారిపల్లి, తిమ్మాయిపల్లి, సీతారాంపురం గ్రామాల వద్ద ముందస్తుగా వరి నారు పోసిన రైతులు పంట సాగుచేపడుతున్నారు.



విత్తన వడ్లను ఎద్దుల బండిపై తీసుకెళుతున్న రైతు

రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు : చైర్మన్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్,హర్షవర్ధన్‌రెడ్డి, కమిషనర్ శేషఫణి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్లలో పలు అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తామని మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, కమిషనర్ శేషఫణి తెలిపారు. ఆ మేరకు టెండర్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం అభివృద్ధి పనుల గురించి చర్చించేందుకు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్, కమిషనర్ మాట్లాడుతూ సీసీ రోడ్లు, సీసీ డ్రెయినేజీ, వీధి దీపాలు, తాగునీటి పైప్‌లైన్ వంటి 35 పనుల నిమిత్తం రూ.3కోట్లు నిధులు బిపిఎస్ కింద మంజూర య్యాయని తెలిపారు. పట్టణంలో రూ.10 కోట్లతో పలు అభివృద్ధి పనుల గురించి ప్రతి పాదనలు పంపామన్నారు. ఇందులో రూ.కోటి పనులు అంటే ప్యాచ్ వర్కు, పైప్‌లైన్లు త్వరగా జరిగితే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. వారం రోజుల్లో రూ.40లక్షలు నిధులు మంజూరు కానున్నట్లు తెలిపారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద మరో రూ.25 లక్షలు మంజూరయ్యాయని, వీటితో సుందరయ్య నగర్‌లో సిమెంటు రోడ్డు, ప్రకాష్ నగర్‌లో ప్యాచ్‌వర్క్ చేయనున్నట్లు తెలిపారు. రూ.10 లక్షల బోర్లు వాటి మరమ్మతుల కోసం మంజూరయ్యాయని వివరించారు. పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎరికలరెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

ఎస్‌విడిసిలో టైగర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం టైగర్స్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హిమాంజలి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ లక్ష్మి కుమారి, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి శ్రీనివాసుల రెడ్డి, ఎన్టీఆర్ విశ్వవిద్యాలయ ఈసీ మెంబర్ డాక్టర్ వరుణ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరి నారాయణ మాట్లాడుతూ కళాశాలలో విద్యను అభ్యసించడానికి వచ్చిన విద్యార్థులకు విద్యతోపాటు పలు రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారు చైతన్యవంతులవుతారని తెలిపారు. ఒంటెరు శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ కళాశాల 20 సంవత్సరాల అనుభవంతో అటానమస్ పొందిందన్నారు. విద్యార్థులను విద్య, ఉద్యోగ అవగాహన కార్యక్రమాల్లో ముందుంచడంలో వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హిమాంజలి మాట్లాడుతూ విద్యార్థులు ఏదైనా ప్రాముఖ్యతకు సంబంధించి ఒక డే సెలబ్రేషన్స్ అనేది చేస్తున్నారంటే, వాటిని మనం గుర్తుకు తెచ్చుకొని తగిన విధంగా ముందుకు పోవాలని సూచించారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు టైగర్స్ డే సెలబ్రే షన్స్‌కు సంబంధించి దాని ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు అవగాహనతోపాటు ఆచరణ కూడా ఎంతో ముఖ్యమని కళాశాల కో-ఆర్డినేటర్ పర్లపాడు గౌరీ శంకర్ తెలిపారు. టైగర్స్‌కు సంబంధించి వాటి జీవనశైలి, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కొన్ని నృత్య ప్రదర్శన ద్వారా విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శారద భవాని, డైరెక్టర్ పృథ్వీ నారాయణ, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్స్ రాధా, రాజీవ్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హిమాంజలి

యుసిఐఎల్‌ను సందర్శించిన 'ఉస్మానియా' విద్యార్థులు



ప్లాటినం వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - వేముల

అణుశక్తి విభాగం (డిఎఇ) ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం భూగర్భ శాస్త్ర విభాగం నుండి విద్యార్థుల బృందం మంగళవారం తుమ్మల పల్లెలోని యుసిఐఎల్ కర్మాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భారతదేశ అణు ఇంధన చక్రానికి దోహదపడే యురేనియం మైనింగ్, ప్రాసెసింగ్ కార్యాచరణ అంశాలను విద్యార్థులకు ప్రత్యక్షంగా తెలియజేయడానికి ఈ విద్యా సందర్శన నిర్వహించారు. విద్యార్థులను యుసిఐఎల్ సీనియర్ అధికారులు స్వాగతించారు. ఈ సందర్శనలో గని స్థలం, ప్రాసెసింగ్ ప్లాంట్, పర్యావరణ నిర్వహణ, సౌకర్యాల గైడెడ్ టూర్ పర్యవేక్షించారు. తుమ్మలపల్లె నిక్షేపం భూగర్భ శాస్త్రం, ఆ ప్రదేశంలో ఉపయోగించే ప్రత్యేకమైన ఆల్కలీన్ లీచింగ్ టెక్నాలజీ, స్థిరమైన మైనింగ్ పద్ధతులకు కంపెనీ నిబద్ధతను యుసిఐఎల్ నిపుణులు వివరించారు. కార్యక్రమంలో కిషోర్ భగత్, సుమన్ సర్కార్, అమ్జాద్ అలీ, ఎల్.రాజేష్, మోహన్‌రెడ్డి, వాసుదేవ్ రెడ్డి, విజయ్‌కుమార్, విపిన్ కుమార్‌శర్మ, ఎన్.వి.రెడ్డి పాల్గొన్నారు.

డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చాపాడు

డిజిటల్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్ధన్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఖాదరపల్లి గ్రామంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ కెవి రమణ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై స్యాచురేషన్ డ్రైవ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం డిజిటల్ మోసాలు అధిక మయ్యాయన్నారు. ఓటీపీలు అడిగి బ్యాంకు ఖాతాల్లోని నగదును అపహరణ చేస్తున్నారన్నారు. ముఖ్యంగా వరుస సెలవు దినాలు ఉన్న సమయంలో సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఏ బ్యాంకు సిబ్బంది కూడా ఫోన్‌లో ఓటీపీలు అడగరని గుర్తించుకోవాలన్నారు. ప్రతి పదేళ్లకోసారి బ్యాంకు ఖాతాలను ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ హెడ్ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా రూ.20 చెల్లించి రూ.రెండు లక్షల ప్రమాదబీమా పొందాలన్నారు. జీవనజ్యోతి పథకం ద్వారా రూ.436 చెల్లించి జీవిత బీమా పొందవచ్చు అన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా, బ్యాంకు ద్వారా అందుతున్న సేవల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది జయశేఖర్, యానిమేటర్లు సాంబ, సుబ్బయ్య, శరత్, ఓబుల రాజు, బిసిఓ జమీల, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్ధన్

సర్వర్ మొరాయింపు.. రైతులకు ఇబ్బందులు..!



ప్రజాశక్తి - తొండూరు

రైతు సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన చేయించుకునేందుకు రైతులకు తిప్పలు తప్పడం లేదు. పథకాన్ని అమలు చేసే విధానంలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు, ముఖ్యంగా ఆన్‌లైన్ సర్వర్ మొరాయింపుతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వర్షాభావం నేపథ్యంలో పెట్టిన పంటలు చెడిపోతాయనే భయంతో, భవిష్యత్ రక్షణ కోసమే రైతులు బీమా కోసం ముందుకొస్తున్నారు. కానీ సచివాలయాలకు వెళ్లినప్పుడు సర్వర్ పని చేయడం లేదు.. రేపు రండి అనే మాటలు మాత్రమే వినిపిస్తున్నాయి. దీంతో రైతులు రోజుకోసారి తిరిగి రావాల్సిన పరిస్థితి. బీమా చేయించుకునేందుకు ఈనెల 31 చివరిరోజు కావడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకింది. ఈ నేపథ్యంలో బీమా గడువు పెంచాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఆన్‌లైన్‌కు బదులుగా ఆఫ్‌లైన్ నమోదు అవకాశాన్ని ఇవ్వాలని సూచిస్తున్నారు. ప్రతి సచివాలయంలో ప్రత్యేక సాంకేతిక సాయం కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



సాగైన వరి పంటను పరిశీలిస్తున్న ఎఒ దేవి పద్మలత

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - చాపాడు

వరి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారి దేవి పద్మలత సూచించారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఎస్ ఓబాయపల్లె, అయ్యవారిపల్లె గ్రామాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటసాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని తెలిపారు. అధిక మోతాదులో యూరియా వాడరాదన్నారు. ఒక ఎకరాకు వరి పైరు పంటకాలం మొత్తం కేవలం 90 కిలోల యూరియా మాత్రమే ఉపయోగించాలన్నారు. చివరి దుక్కిలో సింగిల్ సూపర్ పాస్పేట్, డిఎపి ఎరువును ఎకరాకు ఒకటిన్నర బస్తా చొప్పున వేయాలన్నారు. వరి పైరుకు తప్పకుండా బీమా చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ స్వప్న, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - ఖాజీపేట

రైతులు సాగు చేసిన పంటలకు ఇ-క్రాప్ తప్పక నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి నాగార్చన సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చెముళ్ళపల్లెలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద వరి పంటకు ఆగస్టు 15 వరకు మీ సేవా కేంద్రాలలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనంతరం పసుపు పంటను పరిశీలించి, సస్యరక్షణ చర్యలు వివరించారు.

వేరుశనగ సాగులో మెలకువలు పాటించాలి

ప్రజాశక్తి - వేముల

స్థానిక రాచకుంటపల్లి, ముబ్బు చింతలపల్లి గ్రామాల్లో మంగళవారం ఎఒ జిపి ఓబులేస్ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఖరీఫ్ పంట స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రోన్ టెక్నాలజీ గురించి వివరిస్తూ రాబోయే రోజుల్లో రోబోటిక్ వ్యవసాయం క్రియాశీలకంగా మారునుందన్నారు. సాగులో ఉన్న వేరుశనగ పంట దిగుబడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వేరుశనగకు రక్షక పంటగా సజ్జ లేదా జొన్న చిక్కగా వేసుకోవాలని సూచించారు. తద్వారా రసం పీల్చే పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, విహెచ్ఎ గోపి, రైతులు పాల్గొన్నారు.



ఉపాధి పనులపై విచారించాలని కోరుతున్న ఎంపిటిసి చంద్రభాస్కర్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - ఖాజీపేట

అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎంపిడిఒ దివిజా సంపతి సూచించారు. ఖాజీపేట ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఆయా ప్రభుత్వ శాఖల ప్రగతిపై సమీక్షించారు. ఎంపిటిసి చంద్రభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ఆ పనులపై విచారణ జరిపించాలని అధికారులను కోరారు. ఖాజీపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినా ప్రభుత్వం నుంచి ఏ విధమైన ఆర్థిక ప్రయోజనాలు రైతులకు కలగలేదని పలువురు ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కరువు మండలం కింద ఆదుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలకు తూట్లు.. అక్రమ లే అవుట్లు..!

- వంకలు పూడ్చే.. లేఅవుట్స్‌కు రెక్కలొచ్చే

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టానుసారం ఆక్రమిస్తున్నారు. వంకలు పూడ్చి, ఎలాంటి అనుమతులు లేకుండా వ్యవసాయ భూముల్లో అక్రమ లే అవుట్ వేస్తున్నారు. దీనిపై పంచాయతీ అధికారులు, రెవెన్యూ యంత్రాంగం, అన్నమయ్య అర్బన్ డెవలప్మెంట్ వారు పట్టించుకున్న పాపాన పోలేదు. నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్లు వేయడం వల్ల ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లుతున్నా అధికార యంత్రాంగంలో మాత్రం చలనం రావడం లేదు. అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. ధనవంతులకు, రాజకీయ నాయకులకు బాసటగా నిలుస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. నీళ్లు పారే వంకలను సైతం పూడ్చి ఇష్టానుసారంగా లే అవుట్లు వేసి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. అధికార యంత్రాంగం అటువైపు తొంగి చూసిన పాపాన పోలేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలు సేవించడం నేరం

ప్రజాశక్తి - లింగాల

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎఎస్ఐ శేషయ్య పేర్కొన్నారు. పెద్దకుడాల జిల్లాపరిషత్ హైస్కూలో మంగళవారం స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో 'మాదక ద్రవ్యాలు నిర్మూలన.. మనందరి బాధ్యత' అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ గంజాయి, కోకైన్, పొగాకు వంటి మాదక ద్రవ్యాల పట్ల యువత దూరంగా ఉండాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు నివారించే దిశగా అడుగులు వేయడం విద్యార్థి దశ నుంచి అలవరచుకోలన్నారు. మానసిక ఒత్తిడి జయించేందుకు యోగాను అలవాటు చోసుకోవాలన్నారు. అనంతరం మాదకద్రవ్యాలు నివారణ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ రామకృష్ణయ్య, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు వాసుదేవరెడ్డి, ప్రాథమిక వైద్యశాల సూపర్‌వైజర్ ఆశాబేగం పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎఎస్ఐ శేషయ్య